క్లుప్తంగా

విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ



జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పంచాయతీ కార్యదర్శి రవికిరణ్

రోలుగుంట : మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి రవి కిరణ్ స్వచ్ఛతా హీ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాఠశాలను గ్రామ వీధుల్లో ర్యాలీగా వెళ్లి తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. తరువాత మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రతతోనే రోగాలు దూరమౌతాయన్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై పాటించాలన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. మొక్కలు నాటుదాం–పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాన్ని ఈవోపీఆర్డీవో ఎస్.నూకరాజు పర్యవేక్షించారు.

తాచేరు డైవర్షన్ రోడ్డుపై రాకపోకలు



డైవర్షన్ రోడ్డులో ప్రయాణిస్తున్న వాహనాలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల విజయరామరాజుపేట తాచేరు డైవర్షన్ రోడ్డుపై నుండి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తాచేరు డైవర్షన్ రోడ్డుకు గండి పడింది. దీంతో 15 రోజులుగా ఈ రోడ్డులో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు గండిని పూడ్చడంతో వాహనదారులకు రవాణా సదుపాయం కలిగింది. విశాఖ, పాడేరు, అనకాపల్లి, నర్సీపట్నం రహదారుల్లో తిరిగే వాహనదారులకు మరలా రాకపోకలు సాగుతున్నాయి.

28న మహాజన సభకు తరలిరండి



రైతులతో మాట్లాడుతున్న శ్రీను

చీడికాడ : ఈ నెల 28న చోడవరం సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో జరిగే మహాజన సభనుకు సభ్య రైతులందరూ తరలిరావాలని సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయనను తన స్వగ్రామం ఖండివరంలో ఫ్యాక్టరీ ఏఓ దొరబాబు కలిసి మహాజన సభకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందించారు. ఈ మేరకు శ్రీనివాసరావు ఆ బుక్‌లేట్‌లను పలువురు రైతులకు అందించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఫ్యాక్టరీ ఆవరణలో జరిగే సభకు హాజరు కావాలని ఆయన రైతులను కోరారు. ఆయన వెంట ఫీల్డ్‌మన్లు ఎస్.జగన్‌మోహన్‌రావు, బి.సూరిబాబు ఉన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు



మామిడిపల్లిలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ చేపడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

దేవరాపల్లి : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారానే ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు అన్నారు. ఈ మేరకు మామిడిపల్లిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి పారిశుధ్యంపై అవగాహన ర్యాలీని నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ బాబు, వీఆర్‌వో లక్ష్మణ్, చల్లా మహేష్ పాల్గొన్నారు.

కేజీబీవీ రోడ్డులో జంగిల్ తొలగింపు



తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

మాకవరపాలెం : కేజీబీవీ పాఠశాలకు వెళ్లే రోడ్డుకిరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఈ పాఠశాలకు వెళ్లేందుకు విశాఖ–నర్సీపట్నం ప్రధాన రహదారి నుంచి కిలోమీటరు మేర వేశారు. అయితే ఈ రోడ్డుకిరువైపులా పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. దీంతో భీమబోయినపాలెం సర్పంచ్ నందకిషోర్ ఆధ్వర్యంలో గురువారం 15వ ఆర్థిక సంఘ నిధులతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు.

- జిల్లాలో మేజరు ప్రాజెక్టును వెంటాడుతున్న సిబ్బంది కొరత
- గతంలో తాండవ కాలువలపై 40 మంది లష్కర్ల పర్యవేక్షణ
- నేడు లష్కర్లు లేక 120 కిలోమీటర్లు పొడవునా పర్యవేక్షణ కరువు
- వృథాగా పోతున్న సాగునీరు, శివారు ఆయకట్టుకు అందని వైనం

లష్కరుల కొరత... సాగునీరు వృథా..



స్పిల్‌వే ద్వారా నీటి విడుదలకు గేట్లు ఎత్తుతున్న ప్రాజెక్టు డీఈ అనురాధ, ఇతర అధికారులు



కాలువలపై పర్యవేక్షణ లేక నర్సీపట్నం తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వృథాగా పోతున్న సాగునీరు



పంటపొలాలకు కాలువలో ప్రవహిస్తున్న తాండవ నీరు

నాతవరం : జిల్లాలో ఏకైక మేజరు ప్రాజక్టు తాండవ రిజర్వాయరుకు లష్కర్లు లేకపోవడంతో వారు చేసే పనులు ఇంజనీర్లే చేసుకుంటున్నారు. కొంత కాలంగా తాండవ ప్రాజెక్టు సిబ్బంది కొరతతో కాలం వెళ్లదీస్తున్నారు. రెండు జిల్లాల పరిధిలో 51,485 ఎకరాలకు ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు సాగుకు నీటిని ప్రతి ఏటా సరఫరాచేస్తుంది. అంతటి ప్రాముఖ్యం కలిగిన తాండవ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాండవ రిజర్వాయరు నిర్మాణం చేసి మొట్టమొదటిగా 1974లో ప్రాజెక్టు నుంచి ప్రధాన గేట్లు ఎత్తి పంట కాలువలకు నీటిని విడుదల చేశారు. ఆ సమయంలో తాండవ రిజర్వాయరు పరిధిలో 40మంది లష్కర్లు పని చేసేవారు. అప్పట్లో ప్రభుత్వం నియమించిన లష్కర్లు పదవీ విరమణ చేయడంతో వారి స్థానంలో కొత్తవారిని ఇరిగేషన్‌శాఖ నియమించలేదు.

లష్కర్లు ఉన్న సమయంలో తాండవ ప్రాజెక్టు నుంచి శివారు ఆయకట్టుకు సైతం పంట పొలాలకు పుష్కలంగా సక్రమంగా నీరు ప్రవహించేది. ప్రాజెక్టు నుంచి ఖరీఫ్ సీజన్‌కు నీటిని విడుదల చేసిన దగ్గర్నుంచి పంట పూర్తి అయ్యేంత వరకు లష్కర్లు నిత్యం కాలువలపై పర్యవేక్షణ చేసేవారు. కూడా చుక్కనీరు వృథాగా కాకుండా పంట పొలాలకు ప్రవహించేలా చర్యలు చేపట్టేవారు. గండి పడిన చోట యుద్ధ ప్రాతిపదికన పనులు చేసేవారు. తాండవ ప్రాజెక్టు రెండు జిల్లాల పరిధిలో 120 కిలోమీటర్ల పొడవునా పెద్దా చిన్న కాలువలు ద్వారా నీరు ప్రవహిస్తుంది. లష్కర్లు లేక అత్యవసర సమయంలో జేఈలు, డీఈ స్థాయి అధికారులే పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. గతంలో తాండవ రిజర్వాయరుపై స్పిల్ వే గేట్ల వద్ద లష్కర్లు పని చేసేవారు. లష్కర్లు లేక తాండవ రిజర్వాయరుపై ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ప్రాజెక్టుపై లక్షలాది రూపాయలు వ్యయంతో తీర్చిదిద్దిన కుండీలలో పూల మొక్కలు సైతం ధ్వంసం చేసేసారు. నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, కాకినాడ జిల్లా కోటనందూరు, రవతలపూడి కేఈ చిన్నయ్యపాలెం క్లస్టర్లు పరిధిలో పంట కాలువలపై ఆయా ప్రాంతాలు జేఈలే పర్యవేక్షిస్తున్నారు. ప్రధాన గేట్ల నుంచి స్పిల్‌వే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలన్నా ఈఈ, డీఈ, జేఈలు సిబ్బందితో కలిసి స్వయంగా నీటిని విడుదల చేసుకుంటున్నారు. గతంలో కాలువలపై రైతులకు ఎలాంటి సమస్య తలెత్తినా లష్కర్ల దృష్టికి తీసుకెళ్లేవారు. ఇపుడు వారు లేక జేఈలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నీరు వృథా అయ్యేది కాదు..



తాండవ కాలువపై లష్కర్లు ఉండడం వలన రైతులకు అధికారులకు అన్ని విధాలుగా ఉపయోగపడేవారు. స్థానికంగానే రైతుల సమస్యలు పరిష్కరించేవారు. లష్కర్లు తాండవ నీరు శివారు ఆయకట్టుకు సైతం పుష్కలంగా సరఫరా చేసేవారు. ఎక్కడ నీరు వృథా కాకుండా పర్యవేక్షణ ఉండేది. ఇప్పుడు నీరు సరిగ్గా ప్రవహించడం లేదు. ఏదైనా కాలువ సమస్య ఉందంటే తెలియజేయడానికి జేఈలు ఎక్కడ ఉంటారో ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి ఉంది.

– పోలుపర్తి చిట్టిబ్బాయి, ఆయకట్టు రైతు, గునుపూడి

లష్కర్లకు ప్రతిపాదనలు పంపించాం



తాండవ ప్రాజెక్టుకు లష్కర్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. రెండు జిల్లాల పరిధిలో కాలువలపై పని చేసేందుకు సుమారుగా 30 మంది లష్కర్లను నియామకాలు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం నుంచి అదేశాలు వచ్చిన వెంటనే నిబంధనలు అనుసరించి లష్కర్లు నియమకాలు చేపడతాం.

– బి.స్వామినాయుడు, ఈఈ, ఇరిగేషన్‌శాఖ

దసరా ఉత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



దసరా ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నర్సీపట్నం : శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు శ్రీశ్రీశ్రీ దుర్గామేల్లేశ్వరి స్వామి వారి దేవస్థానం, దేవదాయ ధర్మదాయశాఖ ఏర్పాట్లు చేస్తుంది. దీనిలో భాగంగా మున్సిపల్ కౌన్సిలర్ సిహెచ్. పద్మావతి, ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఆవిష్కరించారు. అక్టోబరు 3వ తేదీ నుంచి 13 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగాప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు జంపా నాగేంద్రరాజు తెలిపారు. కార్యక్రమంలో ఈవో దివ్యతేజ, కౌన్సిలర్లు ధనిమిరెడ్డి మధు, జాలుమూరి రాజ్‌కుమార్, రుత్తల కృష్ణ, మార్కెట్ రాజా, చింతూ, బుజ్జి పాల్గొన్నారు.

నూతన ఎస్‌ఐను సత్కరించిన నాయకులు



ఎస్‌ఐ సతీష్‌ను సత్కరిస్తున్న రాజుబాబు తదితరులు

చీడికాడ : చీడికాడ నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన బి.సతీష్‌ను మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు నేతృత్వంలో నేతలు గురువారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయనను పరిచయం చేసుకున్నారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వెంట యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, నాయకులు ధర్మిశెట్టి కొండబాబు, కిముడి సన్యాసిరావు, పలువురు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ ప్రణాళిక తయారు చేయండి



అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం : మండలంలో అన్ని శాఖలు వారీగా 2024–2025 సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఎంపీడీవో హనుమంతరావు ఆదేశించారు. మండల స్థాయి అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి కొత్తగా వచ్చిన అదేశాల ప్రకారం అన్ని శాఖలు అధికారులు యుద్ధ ప్రతిపాదికన ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఇప్పుడు మనం తయారు చేసే ప్రణాళిక అధారంగా రానున్న కాలంలో అభివృద్ధి పనులు చేసేందుకు వీలుంటుందన్నారు.

ఈ విషయాన్ని మండల స్థాయి అధికారులంతా ప్రత్యేక శ్రద్ధతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఈలు జోగారావు, రాజేష్, వెంకటేశ్వరమ్మ, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, వెలుగు ఏపీఎం మర్రిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో విద్యుత్ నిలిపివేత

కె.కోటపాడు : వారాడ సబ్ స్టేషన్ పరిధిలో గల వి.సంతపాలెం, ఆనందపురం గ్రామాల్లో ఈ నెల 20న శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనుల నిర్వహణ నిమిత్తం ఉదయం 10 నుంచి సాయింత్రం 5 గంటల వరకూ రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ ఉండని కారణాన్ని వినియోగదారులు గుర్తించి సహకరించాలని ఏఈ చంద్రశేఖర్‌రావు కోరారు.

కె.జె.పురంలో పసర మోదమ్మపండగ



కె.జె.పురంలో పసరమోదమ్మ పండగ సందర్భంగా ఊరేగింపుగా వెళ్తున్న రైతులు, మహిళలు

మాడుగుల రూరల్ : పాడి పశువులు, సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుతు పశువులు ప్రతి ఏటా నిర్వహించే పసరమోదమ్మ పండగ కె.జె.పురంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గల రైతులు, మహిళలు, నాయకులు ఊరేగింపుగా పసుపు నీళ్లు, పుజా సామాగ్రి పట్టుకుని, కె.జె.పురం పాలగెడ్డ సమీపంలో గల పసరమోదమ్మ రాతి విగ్రహాల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో గల రైతులు, మహిళలతో పాటు సర్పంచ్ రమణబాబు, ఎంపీటీసీ సభ్యులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాత్రికి సంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వీరనారాయణంలో

మాడుగుల రూరల్ : మండలంలో వీరనారాయణం గ్రామంలో గురువారం పసర మోదమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఖరీఫ్ వరి నాట్లు వేసిన తర్వాత ఈ పండగ రైతులు చేయడం ఆనవాయితీగా వస్తుంది. రైతులు వసంతకం పట్టుకుని వెళ్లి పసరమోదమ్మకు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. వసంతకంను పంట పోలాల్లో, పశువుల మీద చల్లారు.

ఎం. కోడూరులో జోరుగా కల్వర్టు పనులు



ఎం.కోడూరులో కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు గ్రామంలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయం సమీపంలో కల్వర్టు నిర్మాణ పనులు గురువారం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు పూడిక పోవడం వల్ల వర్షపు నీరు ఈ ప్రాంతంలో నిల్వ ఉండి పోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రోడ్లు, భవనాలు శాఖ ఆధ్వర్యంలో పూడిక పోయిన కల్వర్టులో పూడిక తీయించి, నాలుగు గొట్టాలు వేశారు. తద్వారా నీరు యథావిధిగా పోవడానికి ఏర్పాటు చేశారు. ఈ కల్వర్టు పనులను మాడుగుల ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్, వర్కు ఇన్‌స్పెక్టర్ పైలా దేముడు నాయుడు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు సహాయ సహకారాలు అందించారు.

ఆక్రమణలు తొలగింపు



అక్రమణదారులకు నచ్చచెప్పతున్న సీఐ రేవతమ్మ

నర్సీపట్నం : పట్టణంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పోలీసు, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. అబీద్ సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఉన్న ఆక్రమణలను సీఐ ఎల్.రేవతమ్మ, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర ఆధ్వర్యంలో పోలీసు, మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా రోడ్డును ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ వ్యాపారులను హెచ్చరించారు. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా అధికారులు తీసుకుంటున్న చర్యలకు వ్యాపారులు సహకరించాలన్నారు.

పారిశుధ్యంపై అవగాహన



బయ్యవరంలో చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, సర్పంచ్

మాకవరపాలెం : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని భీమబోయినపాలెం, వజ్రగడ, తాడపాల, బయ్యవరం, రాచపల్లి, తదితర గ్రామాల్లో చెత్త తొలగింపుతోపాటు వైద్య శిబిరాలు, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే బయ్యవరంలో ప్రజలకు ఎంపీడీవో సీతామహాలక్ష్మి చెత్త తొట్టిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలంతా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఉద్దేశ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో భారీగా అన్నసమారాధన



దేవరాపల్లి అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. రామాలయం వద్ద బాల గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 8 వేల మంది భక్త జనం స్వామి వారి మహాప్రసాదం స్వీకరించారు. అన్నసమారాధనను మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వడ్డన చేసి ప్రారంభించారు. అంతకుముందు ఆయన స్వామిని దర్శించుకున్నారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, లలితానాయుడు, కె.వి.రమణ, సోమిరెడ్డి పేరునాయుడు, గొర్రుపోటు రమాదేవి, చొక్కాకుల వెంకటరమణ, వేచలపు అప్పలనాయుడు, గాలి సూర్యలక్ష్మి తదితరులు స్వామి వారిని దర్శించుకొన్నారు. నిర్వాహకులను అభినందించారు.

కె.కోటపాడు : చౌడువాడ శివారు గరుగుబిల్లిలో గల షిర్డీసాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గురువారం అన్నసమారాధన జరిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జరిపిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి మహాప్రసాదం స్వీకరించారు.

దేవరాపల్లిలో బెంబేలెత్తిస్తున్న వీధి శునకాలు



దేవరాపల్లి ప్రధాన రహదారిలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు



వీధుల్లో స్వైర విహారం చేస్తున్న శునకాల గుంపు

దేవరాపల్లి : మేజర్ పంచాయితీ దేవరాపల్లిలో గత కొన్ని నెలలుగా వీధి కుక్కలు స్థానిక ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రధాన రహదారితో పాటు వీధుల్లో సైతం గుంపులు, గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజలపై తిరగబడి గాయపరుస్తునారు. రాత్రి, పగలు తేడా లేకుండా కాలి నడకన వెళ్లే వారిపైనే కాకుండా వాహనాలపై వెళ్తున్న వారిని సైతం గ్రామ సింహాలు వెంబడించి గాయపరుస్తున్నాయి. దీంతో వారంతా ఆసుపత్రిపాలు కావాల్సిన దుస్థితి నెలకొంటుంది. వీధి కుక్కలకు భయపడి వృద్ధులు, చిన్న పిల్లలు బయటకు వచ్చేందుకు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఏ సమస్యపై ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. వీధి కుక్కలను నివారించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు కె.వి. రమణ తదితర సభ్యులు ఎంపీడీవోకు సైతం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన పట్టించుకోక పోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్య వైఖరిని వీడి వీధి కుక్కల సమస్య నుంచి విముక్తి కల్పించాలని దేవరాపల్లి గ్రామస్తులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

గ్రామీణ విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీతకు ఆటలు



మాట్లాడుతున్న ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు

నాతవరం : గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆటలు పోటీలు ఎంతో దోహద పడతాయని ఎంఈవో –2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండల కేంద్రంలో గల హైస్కూల్‌లో గురువారం మండల స్థాయిలో గల హైస్కూల్ విద్యార్థులచే ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, సర్పంచ్ గొలగాని రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ మండల స్థాయి ఆటల పోటీలను మూడు రోజుల పాటు నాతవరం హైస్కూల్లో నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు వివిధ హైస్కూలు నుంచి బాలురు, వివిధ పోటీల్లో పాల్గొనేందుకు 169 మంది హాజరయ్యారని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేశామన్నారు. రెండో రోజు బాలికల పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో నైపుణ్యం కనబర్చిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కమిటీ చైర్మన్ చిటికిల శ్రీను, మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాలివలసలో ఉచిత కంటి శిబిరం

కె.కోటపాడు : కంటి సంబంధిత సమస్యలకు మెరుగైన వైద్యం సకాలంలో పొందడం అవసరమని సంఘమిత్ర రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతి అన్నారు. దాలివలసలో సంఘమిత్ర రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 182 మంది కంటి సంబంధిత రోగులకు విశాఖపట్నానికి చెందిన ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆప్తాలమిక్ మానస పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన 27 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నట్టు బొంతు మంగపతి తెలిపారు. కార్యక్రమంలో సంఘమిత్ర సభ్యుడు బండారు వెంకట రమణమూర్తి, క్యాంప్ కోఆర్డినేటర్ సంతోషి పాల్గొన్నారు.